క్లుప్తంగా

వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి

టేక్మాల్ (మెదక్): టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గతంలో సహకార సంఘం, ఐకేపీ, డీసీఎంఎస్ మూడు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండేవనీ, ప్రస్తుతం ఏ ఒక్కటి కూడా ప్రారంభించడం లేదన్నారు. వెంటనే వారి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతుల సమస్యలను తీర్చాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసి, డబ్బులు వెంట వెంటనే వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఊపందుకున్న వరి కోతలు



రామోజిపల్లిలో కొనసాగుతున్న వరికోత పనులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో వరి కోతలు ఊపందుకున్నాయి. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రైతులు తమ పంట పొలాల కోతల పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో కూలీల కొరత కారణంగా వరికోత యంత్రాల ద్వారా పనులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ద్వారా వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

టేక్మాల్‌లో మన్ కీ బాత్



మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు మండల కేంద్రంలోని మంసాన్‌పల్లి రమేశ్ ఇంట్లో ఆదివారం బీజేపీ నాయకులు అవగాహన కల్పిస్తూ మనకీబాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు డాకప్పగారి నవీన్ గుప్తా, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మల్లికా, నాయకులు పద్మ, రమేశ్, అశోక్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా శివకుమార్



శివకుమార్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

గజ్వేల్: రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పట్టణానికి చెందిన కె.శివకుమార్ నియామకమయ్యారు. ఆదివారం హైదరాబాద్ బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో ఈ ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా శివకుమార్‌ను సంయక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికచేశారు.

కొండపోచమ్మకు పుజలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని కొండ పోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం కొండపోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి



శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృత్యువాత పడిన సంఘటన మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు ఏనుగు నర్సింహారెడ్డి పాడిగేదెలతో జీవనోపాధి పొందుతున్నాడు. రోజువారిగానే తన పాడిగేదెలను మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి పాడిగేదె అక్కడికక్కడే మృత్యువాత పడింది. పాడిగేదె విలువ రూ.లక్ష యాభై వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. బాధిత రైతుని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి కోరారు.

‘ఎత్తిపోతల’కు నిధులు మంజూరు

బోరంచ ఎత్తిపోతల పథకం ద్వారా రేగోడ్ చెరువులోకి నీళ్లు

- మంత్రి దామోదర కృషి ఫలితం
- రూ.2కోట్లు 59 లక్షలు విడుదల
- నేడు శంకుస్థాపన



నీళ్లు పారనున్న భూములు

రేగోడ్(మెదక్): వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కృషి ఫలితంగా దశాబ్దాల రైతుల కల నెరవేరనుంది. రూ.కోట్లు మంజూరు చేసి వందల ఎకరాలకు సాగుకు నీరందించనున్నారు. మంత్రి దామోదర మండలంలోని టి.లింగంపల్లిలో సోమవారం ఈ పథకానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ పథకం ప్రారంభమైతే రైతులకు వరంగా మారి.. భూములన్నీ పచ్చని పొలాలతో సస్యశ్యామలంగా కలకలలాడనున్నాయి. సంగారెడ్డి జిల్లా మనూరు మండలం బోరంచలో అప్పటి మంత్రి దామోదర 2009లో రూ.20 కోట్లు మంజూరు చేసి, ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. బోరంచ, సిందోల్, టి.లింగంపల్లి, తాటిపల్లి గ్రామాల్లోని 2900ల ఎకరాలకు సాగుకు నీరందించాలనేది లక్ష్యం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మంత్రి దామోదర మరో రూ.4 కోట్లు మంజూరు చేశారు.

ఐదు వందల ఎకరాలకు నీళ్లు

మండలంలోని టి.లింగంపల్లి గ్రావిటి లైన్ రెండు కిలోమీటర్ల మెర పైపులైన్ ఏర్పాటు కోసం తాజాగా రూ.2కోట్లు 59 లక్షలు మంజూరు చేశారు. ఈపైపులైన్ ద్వారా రేగోడ్-మర్పల్లి మంబోజి చెరువు సమీపంలోని ఫీడర్ చానల్‌లోకి నీళ్లను సరఫరా చేస్తారు. రేగోడ్-మర్పల్లి చెరువు నుంచి చౌదర్‌పల్లి, కొత్వాన్‌పల్లి చెరువులను నింపడంతో నిండుకుండలా ఉంటాయి. దాంతో 500ల ఎకరాలకు సాగుకు నీళ్లు పారుతాయని సమాచారం. బోరంచ నుంచి రేగోడ్ చెరువును నీళ్లతో నింపాలని గతంలో ఎన్నో ప్రభుత్వాలకు వినతి పత్రాలను అందజేసినా.. ఎవరూ పట్టించుకోలేదని రైతులు చెప్తున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చి నెరవేరుస్తున్న ఘనత మంత్రి దామోదరదేనని అన్నారు.



ఎత్తిపోతల మోటార్లున్నది ఈ భవనంలోనే

మంత్రికి కృతజ్ఞతలు



ఎన్నో ఏళ్ల కల నెరవేరుతోంది. ఎంతో మంది నాయకులకు మొరపెట్టుకున్నా.. ఎవరూ పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసిన మంత్రి దామోదరకు కృతజ్ఞతలు

– అంజిరెడ్డి, రైతు కొత్వాన్‌పల్లి

అంతా సస్యశ్యామలమే..



సాగుకు నీళ్ల లేక చాలా మంది రైతులు తమ భూములను పడావుగా ఉంచుతున్నారు. నీళ్ల కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నాం. పనులు త్వరగా పూర్తయితే భూములన్నీ పచ్చని పొలాలుగా మారుతాయి. దీంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది.

– యాదయ్య, రైతు చౌదర్‌పల్లి

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?



శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం



కేంద్రంలో చిన్నారులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని లింగోజిగూడ గ్రామంలో శిథిలావస్థ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుంది. దీంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో ఈ భవనంలోనే ప్రాథమిక పాఠశాల కొనసాగింది. భవనం శిథిలావస్థలో ఉండడంతో అక్కడి నుంచి విద్యార్థులను నూతన భవనంలోకి మార్చారు. ప్రస్తుతం భవనంపై పెచ్చులు ఊడుతున్నా.. దాంట్లోనే చిన్నారులకు బోధన జరుగుతోంది. ప్రమాదం జరగకముందే జిల్లా అధికారులు స్పందించి గ్రామంలో ఉన్న కమ్యూనిటీ హాల్, లేదా అద్దె భవనంలోకి మార్చాల్సిన అవసరం ఉంది. నూతన అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన

వెల్దుర్తి(తూప్రాన్): గ్రామాల్లో మూఢనమ్మకాలను ప్రజలు నమ్మొద్దని పోలీసులు జలాల్‌పూర్ తండాలో బాణామతిపై శనివారం రాత్రి అవగాహన కల్పించారు. పోలీసుల ప్రత్యేక బృందం మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్‌తండాలో బాణామతి, మూఢనమ్మకాలపై ఎస్పీ ఆదేశాల మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజు మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి అపోహాలకు పోవొద్దని, వాస్తవాలను నమ్మాలని, మూఢనమ్మకాల వద్ద బలికావొద్దని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లాయక్ అలీ, పోలీస్ బృందం తదితరులు పాల్గొన్నారు.



మన్నెవారి జలాల్‌పూర్ తండాలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రైతులకు అండగా ప్రభుత్వం

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, రైతులకు ఎక కాలంలో రుణ మాఫీ చేసిన ఘన కాంగ్రెస్ పార్టీదని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దండుపల్లిలో తూప్రాన్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ గ్రేడ్ వరికి క్వింటాల్‌కు రూ. 2320 చొప్పున అందివ్వనున్నట్లు తెలిపారు. రూ. 500 బోనస్ సైతం అందించనున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, డైరెక్టర్ జావీద్‌పాషా, నాయకులు భిక్షపతి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్, నాగరాజుగౌడ్, సంతోష్, గణేశ్, భాను, లక్ష్మారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.



దండుపల్లి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

సిరులు కురిపించే బాస్మతి

నార్సింగిలో వెదజల్లుతున్న గుమగుమలు

చిన్నశంకరంపేట(మెదక్): బాస్మతి రైస్‌కు పెట్టింది పేరు నార్సింగి మండల కేంద్రం. ఒకప్పుడు బాస్మతి ధాన్యం రైతులకు సిరులు కురిపించింది. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నార్సింగి బాస్మతి కొన్నాళ్లుగా కనుమరుగైంది. బాస్మతి పంట సాగుపై మక్కువతో నార్సింగికి చెందిన రామకృష్ణ తన పంట పొలంలో 12 గుంటల బాస్మతి పంట సాగు చేశాడు. వచ్చే యాసంగికి సాగును మరింత విస్తరించనున్నట్లు రైతు రామకృష్ణ తెలిపారు. ఆదివారం నార్సింగి ఏఈఓ విజృంభణ, దివ్య క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా బాస్మతి పంటను పరిశీలించారు.



నార్సింగిలో బాస్మతి వరి పంటను పరిశీలిస్తున్న ఏఈఓలు విజృంభణ, దివ్య

యథేచ్ఛగా అక్రమ కలప వ్యాపారం

పట్టించుకోని అటవీ శాఖ అధికారులు

అల్లాదుర్గం(మెదక్): పర్యవరణాన్ని రక్షించేందుకు ప్రభుత్వం ఒక వైపు మొక్కలు నాటుతుంటే, మరో వైపు అక్రమ కలప వ్యాపారులు యథేచ్ఛగా చెట్లను నరికేస్తున్నారు. వారంలో 5 నుంచి 10 లారీల్లో రాత్రి వేళ, సెలవు రోజుల్లో తరలిస్తున్నారు. అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా.. చర్యలు తీసుకోవడం లేదు. మండలంలోని ముస్లాపూర్ కేంద్రంగా అక్రమ కలప వ్యాపారం మూడు ట్రాక్టర్లు, ఆరు లారీలుగా కొనసాగుతోంది. ఖమ్మం, మహారాష్ట్ర నుంచి వచ్చిన అక్రమ కలప వ్యాపారులు రైతులకు డబ్బు ఆశ చూయించి, వందలాది చెట్లను రోజూ నరికి వేస్తున్నారు. పంట పొలాలకు చెట్ల నీడతో ఇబ్బందిగా ఉందని రైతులతో రాయించుకొని చెట్లు నరికేందుకు అనుమతులు తీసుకొని, అక్రమ వ్యాపారానికి శ్రీకారం చూట్టారు. 10 చెట్లకు అనుమతి ఉంటే వందల చెట్లు నరికి వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. లారీల్లో కలపను తరలిస్తున్నారని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా, వారు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. మండల పరిధిలోని ముస్లాపూర్, వెంకట్‌రావ్‌పేట, రెడ్డిపల్లి, బహిరన్‌దిబ్బ, చెవెళ్ల గ్రామాల్లో అక్రమార్కులు చెట్లను నరికి రాత్రులు లారీల్లో తరలిస్తున్నారు. పచ్చని పల్లెలను అక్రమ కలప వ్యాపారులు నాశనం చేస్తున్నారు. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు స్పందించి అక్రమ కలప వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ వికాస్‌ను వివరణ కొరగా.. అక్రమ కలప రవాణపై విచారణ చేసి, చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెట్లను నరికేందుకు అనుమతులు ఇవ్వలేదన్నారు.



ముస్లాపూర్ శివారులో నిల్వ చేసిన కలప దుంగలు




కలప దుంగలు తొలిచే మిషన్

అనుమానాస్పద స్థితిలో ఆవు మృతి

కలుషిత జలాలే కారణమంటూ బాధితుడి ఆరోపణ

ములుగు(గజ్వేల్: మండలంలోని కొక్కొండలో ఒక పాడిఆవు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకోగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. పొలం సమీపంలో ఉన్న పరిశ్రమ నుంచి వెలువడుతున్న కలుషిత జలాలే ఆవు మృతికి కారణమని బాధిత రైతు గోద వెంకటేశ్ ఆరోపించాడు. విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ విజయ్‌కుమార్, బాధితుడు తెలిపిన ప్రకారం.. వెంకటేశ్‌కు నాలుగు ఆవులు, ఒక దూడ ఉన్నాయి. వాటిని తమ వ్యవసాయ భూమి వద్ద మేపుతుంటాడు. వ్యవసాయ భూమిలోకి సమీప పరిశ్రమలోని వ్యర్థ జలాలు వస్తుంటాయి. వాటిని రాకుండా చూడాలని ఆ పరిశ్రమ యాజమాన్యానికి చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో శుక్రవారం ఆవు ఆ నీటిని తాగడం వల్ల మరణించిందని, పది రోజుల క్రితం దూడ కూడా చనిపోయిందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



బాణసంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి

పెద్దశంకరంపేట(మెదక్): దీపావళి పండుగను పురస్కరించుకొని బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు అనుమతిని తప్పకుండా తీసుకోవాలని ఎస్‌ఐ శంకర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వ్యాపారులు తప్పకుండా విద్యుత్, ఫైర్ అధికారుల సూచనలు పాటించడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

‘ఒకటే డీఏ ఇవ్వడం అన్యాయం’

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు డీఏలు బకాయి పడగా, అందులో ఒకటి మాత్రమే చెల్లించేందుకు ముందుకు రావడం అన్యాయమని రాష్ట్ర పీఎస్‌హెచ్‌ఎంల రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలో మూడు డీఏలు పెండింగ్ ఉండగా, ప్రస్తుత ప్రభుత్వ హయంలో మరో రెండు డీఏలు పెండింగ్ పడ్డాయన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన పీఆర్‌సీ కూడా వాయిదా వేసిందన్నారు. కనీసం రెండు డీఏలు అయినా ఇవ్వాలన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని చెప్పినా.. కెబినెట్ మీటింగ్‌లో దాని ప్రస్తావన కూడా లేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైతే మంత్రి వర్గ ఉప సంఘం వేయాలన్నారు. సమస్యలను పరిష్కరించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



నర్సమ్మ(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆదివారం ఎస్‌ఐ రంజిత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 23న మండలంలోని కంచన్‌పల్లి సమీపంలో కంస్‌పల్లి, మానెపల్లి రోడ్డులో రెండు బైక్‌లో ఢీకొనడంతో కంస్‌పల్లి గ్రామానికి చెందిన దుంపల బాలకృష్ణ మృతి చెందిన విషయం విధితమే. కాగా ఆ ప్రమాదంలో మానెపల్లి గ్రామానికి చెందిన అక్కల నర్సమ్మ(45)కు సైతం గాయాలు కాగా హైదరాబాద్ నీమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నల్లపోచమ్మకు భక్తుల పూజలు



కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మదేవికి పూజలు చేస్తున్న భక్తులు



శివ్వంపేట(నర్సాపూర్): ఆలయంలో కొలువైన లక్ష్మీనర్సింహస్వామి

కౌడిపల్లి(నర్సాపూర్): తునికిలోని నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం దేవాదయశాఖ ఉమ్మడి జిల్లా కమిషనర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషకం చేసి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు.

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారితో పాటు ఆలయంలోని బ్రహ్మి, కాళి, వైష్ణవి దేవతలను దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఓడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

సికింద్లాపూర్‌లో..

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భక్తజన సందడి నెలకొంది. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొనేరు పక్కనున్న, గుట్టపైన వెలసిన లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ శశిధర్, ఆలయ ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి తదితరులు ఉన్నారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు

బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రాగౌడ్



తొగుట(దుబ్బాక): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులకు విక్రయించి నష్టపోవద్దని బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రాగౌడ్ రైతులను కోరారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘ్ జిల్లా సమావేశంలో భారతీయ కిసాన్ సంఘ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని లింగాపూర్‌కు చెందిన చేపూరి చంద్రాగౌడ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. త్వరలో జిల్లాలో పర్యటించి రైతులతో సమావేశమై సమస్యలు తెలుసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఇటీవల విద్యుత్ ప్రమాదాలలో నలుగురు రైతులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటచేలలో వైర్లు కిందకు వెలాడటంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదాల్లో మరణించిన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పరామర్శ

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని లకుడారంలో గట్టు కిషన్ ఆదివారం పాము కాటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు కందూరి ఐలయ్య, నర్సింహాచారి తదితరులు పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దేవి రవీందర్, నాయకులు హైమద్, ఈగ స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.



కిషన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రతాప్‌రెడ్డి

జిల్లా స్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా స్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ దినకర్ అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని గుల్షన్‌క్లబ్ ఆవరణలో రెన్‌జుకి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 80 మంది విద్యార్థులు హాజరు కాగా చీఫ్ ఎగ్జామినర్‌గా రెన్‌జుకి షోటోకాన్ కరాటే స్పోర్ట్స్ ఇండియా ఫౌండర్ మాస్టర్ నగేష్ ఎగ్జామినర్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, పర్పుల్, బ్రౌన్1, బ్రౌన్2, బ్రౌన్4 బెల్ట్‌ల్లో పరీక్షలు నిర్వహించగా.. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అనంతరం కరాటే మాస్టర్ నగేష్ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో కరాటే నేర్చుకోవడం అమ్మాయిలకు ఎంతో అవసరం ఉందన్నారు. కరాటే నేర్చుకోవడంతో విద్యార్థులు శారీరకంగా మానసికంగా దృఢత్వం సాధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భూపాల్, గణేశ్, సూరజ్, అఖిల్, అబ్దుల్లా, శ్రీహర్షిత, విశిష్ఠ రాజ్ , స్వరూప్, రవళితో పాటు తదితరులు పాల్గొన్నారు.



కరాటే బెల్ట్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో మాస్టర్లు